క్లుప్తంగా

మోపాల్ డీటీగా సరిత

మోపాల్: మోపాల్ డిప్యూటీ తహసీల్దార్‌గా సరిత శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉత్తర్వులిచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన జగదీశ్వరిని తహసీల్దార్ రామేశ్వర్ కలెక్టరేట్‌కు సరెండర్ చేసిన విషయం తెలిసిందే. సరిత వేల్పూర్ డీటీగా పని చేసి మోపాల్‌కు బదిలీపై వచ్చారు. నెలరోజులుగా డీటీ పోస్టు ఖాళీగా ఉంది. అలాగే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సోహెల్ అదనపు కలెక్టర్ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్‌గా మరొకరిని మండలానికి డిప్యుటేషన్‌పై పంపించాలని ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.

సిరికొండ ఎంపీడీవోగా..



సిరికొండ: సిరికొండ ఎంపీడీవోగా కేఆర్ మనోహర్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఎంపీవో తారాచంద్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. మనోహర్‌రెడ్డి కోటగిరి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

డీపీవో కార్యాలయ ఏవోగా..



సుభాష్‌నగర్: జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ ఏవోగా కృష్ణ కుమార్‌ను(ఎఫ్ ఏసీ) నియమిస్తూ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈమేరకు కృష్ణకుమార్‌కు డీపీవో చక్రవర్తుల తరుణ్ కుమార్ నియామకపత్రం అందజేశారు. అనంతరం కృష్ణ కుమార్ ఏవోగా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది రాజబాబు, ఆదిత్య, సంగ్రామ్, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్కుల పంపిణీ



మోపాల్: కంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రీరామ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నోట్‌బుక్కులు, జామెట్రీ బాక్సులను శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాలచారి మాట్లాడుతూ..శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. 200 నోట్‌బుక్కులు, 90 జామెట్రీ బాక్సులను విద్యార్థులకు అందజేశారని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు టి శ్రీనివాస్, కోశాధికారి టి రామ్మోహన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓజోన్ దినోత్సవం



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రసాయన శాస్త్ర విభాగము ఆధ్వర్యంలో ఓజోన్ పొర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాతావరణంలోని ఓజోన్ పొర ప్రాధాన్యత క్షీణత గురించి ఓజోన్ పొర రక్షణకు తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి రసాయన శాస్త్ర అధ్యాపకులు శారద విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు ప్రభాకర్, రవీందర్ ,శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి హిందీపై పట్టు సాధించాలి



నిజామాబాద్ రూరల్: ప్రతి విద్యార్థి హిందీ భాషపై పట్టు సాధించాలని గుండారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్‌నాథ్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అమర్‌నాథ్ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

డాక్టరేట్ ప్రదానం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి వేముల కాషాగౌడ్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ ఎకనామిక్స్ ప్రొఫెసర్ కే.రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో 'సహకార సంఘాల సమస్యలు, రాజన్న సిరిసిల్ల జిల్లా భవిష్యత్తు అవకాశాలు' అనే అంశంపై కాషాగౌడ్ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంతగ్రంథం సమర్పించారు. తెయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, బీవోఎస్ చైర్మన్ సంపత్, అధ్యాపకులు పాల్గొన్నారు. కాషాగౌడ్‌ను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు.

గణపతయే నమః



మహాగణపతి ఆలయంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ధర్పల్లిలో గణేశుడికి పూజలు చేస్తున్న భక్తులు



గడ్కోల్‌లో అన్నసత్రంలో పాల్గొన్న యువకులు

సాక్షి, నెట్‌వర్క్: నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.



జక్రాన్‌పల్లిలో రెడ్డీస్ యూత్ గణపతి



రాంపూర్ గ్రామంలో గానుగ గణపతి



ఆదర్శ గణేష్ మండలి వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దుబ్బలో జవహర్ కిసాన్ గణేష్ మండలి





వంజర సంఘంలో ఏర్పాటు చేసిన అయోధ్య రామ మందిర సెట్టింగ్.. పక్కన గణనాథుడు



రాజస్థాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడు

ఆకట్టుకుంటున్న సెట్టింగ్‌లు

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలో విభిన్న రూపాల్లో గణనాథుడి ప్రతిమలను ప్రతిష్ఠించారు. పలువురు నిర్వాహకులు మండపాలను అందంగా ముస్తాబు చేశారు. ఆకట్టుకునే సెట్టింగ్‌లు వేశారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



సిరికొండ: రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు నలుగురు విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 9న ఆర్మూర్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో రుతిక్, వర్షిత్, రోహిత్, చందు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నిర్మల్‌లో ఈ నెల 14 నుండి 16 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

సుద్దపల్లి విద్యార్థినులు..



మోపాల్(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి మండలంలోని సుద్దాపల్లిలో 8న జరిగిన జిల్లా బాలికల జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో మోపాల్ మండలంలోని కంజర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు స్నేహిత, చంద్రహాసిని, స్పందన ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయలలిత శుక్రవారం తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ ఉదయ్ శీల, వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లూరి లతను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఇందల్వాయి విద్యార్థిని.



ఇందల్వాయి: ఇందల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హారిక రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ భూపతి రాజేశ్వర్ తెలిపారు. ఈ నెల 14, 15వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగే 43వ రాష్ట్ర స్థాయి పోటీల్లో హారిక పాల్గొంటుందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మోపాల్ మండలంలోని కంజర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 14న వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మనోజ్, ప్రమోద్ పాల్గొననున్నారని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ కాలేజీగా మార్చడాన్ని స్వాగతిస్తున్నాం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) నాయకులు అన్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కాలేజీగా మార్చడం వల్ల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇది పీడీఎస్‌యూ నేతల పోరాటాల వల్లే సాధ్యమైందని అన్నారు. వెంటనే నిధులను విడుదల చేసి, ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభించాల్సిందిగా కోరారు. నాయకులు శ్రీకాంత్, మహేష్, తరుణ్, కోఫ్లీ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేతలు

ఏచూరి మరణం ఉద్యమానికి తీరనిలోటు

సాక్షి నెట్‌వర్క్:సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మరణం విప్లవ ఉద్యమానికి తీరని లోటని వామపక్ష పార్టీ నాయకులు అన్నారు. సీతారాం ఏచూరి అనారోగ్యంతో గురువారం మరణించడంతో శుక్రవారం జిల్లాలో పలుచోట్ల ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడి, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, వాగ్దేవి డిగ్రీ కాలేజీలో ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

సంక్షిప్తం

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నిజామాబాద్‌అర్బన్: నగరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అవార్డు పొందిన ముద్దుకృష్ణను శుక్రవారం డీఈవో దుర్గాప్రసాద్ సన్మానించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.గంగాధర్‌పాల్గొన్నారు.

నూతన గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక

నిజామాబాద్ రూరల్: మల్కాపూర్ తండాకు చెందిన నూతన వీడీసీ కమిటీని శుక్రవారం గ్రామస్తులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సేవాలాల్ మహరాజ్ రామారావు మహారాజ్ ఆలయ ప్రాంగణాల్లో ప్రమాణస్వీకారం చేశారు. వీడీసీ చైర్మన్ రమేష్‌నాయక్, కార్యదర్శి అరవింద్, కోశాధికారి గోపాల్‌నాయక్, సభ్యులు ఉన్నారు.

గుంతలను పూడ్చిన యువకులు

సిరికొండ: కొండూర్‌కు చెందిన యువ చైతన్య యూత్ సభ్యులు రోడ్లపై ఏర్పడ్డ గుంతలను శుక్రవారం పూడ్చారు. గ్రామం నుంచి పెద్దవాల్గోట్ గిర్ని చౌరస్తా వరకు జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో మొరం పోసి పూడ్చారు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండటంతో శ్రమదానం చేసినట్లు యూత్ సభ్యులు తెలిపారు.

నటేశ్వర శర్మకు ఇందూరు కవుల నివాళి

నిజామాబాద్ రూరల్: అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మకు శుక్రవారం శ్రీపాద కళాపీఠం ఆధ్వర్యంలో కవులు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రముఖ కళాకారులు శ్రీపాదకుమారశర్మ మాట్లాడుతూ.. నటేశ్వరశర్మ భావ సరస్వతీ స్వరూపమన్నారు. డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, డాక్టర్ గణపతి అశోకశర్మ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డిచ్‌పల్లి: సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే మన ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి వై.శంకర్ సూచించారు. శుక్ర వారం ఇందల్వాయి పీహెచ్‌సీ పరిధిలోని డిచ్‌పల్లి మండలం రాంపూర్‌లో ఫ్రైడే డ్రైడే కార్య క్రమం నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. స్థానిక ఆరోగ్య కార్యకర్త స్వర్ణలత, ఆశా కార్యకర్తలు స్వర్ణ, మమత, లలిత, హసీనా తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని 33/11 కేవీ వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ వీఎన్-1, వీఎన్-2 ఫీడర్‌లో వినాయక నిమజ్జనం దృష్ట్యా లైన్ల మరమ్మతులు, పర్యవేక్షణ సందర్భంగా పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్-3 ఏడీఈ పి వీరేశం శుక్రవారం తెలిపారు. గోల్‌హనుమాన్, ఆర్యసమాజ్ రోడ్, పులాంగ్ సామిల్ రోడ్, కోటగల్లి, పద్మానగర్ రోడ్‌నెంబర్-1, చైతన్య పబ్లిక్ స్కూల్, రిలయన్స్ స్మార్ట్, ఆర్ఆర్ చౌరస్తా, పెద్ద బజార్, శివాజీనగర్, జెండాగల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

డీ-2 సెక్షన్ పరిధిలో..

నగరంలోని డీ-2 సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్ తెలిపారు. 11 కేవీ సీసీ ఫీడర్ ఎల్లమ్మగుట్ట ప్రాంతం, 11 కేవీ ఖలీల్‌వాడి ఫీడర్‌లో వీక్లీ మార్కెట్, నాగేంద్ర టెంపుల్, పూసలగల్లి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


డిచ్‌పల్లి: డిచ్‌పల్లి, దూస్‌గాం 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కార్యక్రమం చేపట్టనున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ శ్రీనివాస్, ఏఈ సాయిలు శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

తక్షణమే రూ.2 వేల కోట్లు విడుదల చేయాలి




నిజామాబాద్ సిటీ: తెలంగాణలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన వరద బాధితుల సహాయం కోసం వెంటనే రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ..వరదల వల్ల మృతిచెందిన కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. భవిష్యత్తులో ముంపునకు గురికాకుండా ఉండే స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. నాయకులు పి.సుధాకర్, వై ఓమయ్య, కమలాపురం రాజన్న, అంజలి, సాయిలు ఉన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల



మోపాల్: రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం శుక్రవారం గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా విడుదలైంది. ఈమేరకు మండల పరిషత్ కార్యాలయంలో మండల ముసాయిదా జాబితాను ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో కిరణ్‌కుమార్ ప్రదర్శించారు.

జక్రాన్‌పల్లిలో..



జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలో శుక్రవారం ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో సతీష్‌కుమార్ ముసాయిదా జాబితాను ప్రదర్శించారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 14 నుంచి 20 వరకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. 29న ఫైనల్ లిస్టు జారీ చేస్తామన్నారు.

ఏకపక్ష ఉత్తర్వులు రద్దు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ నాయకులు
- విద్యుత్‌భవన్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలియజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

సుభాష్‌నగర్: మెరిట్ కం రోస్టర్ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఏకపక్షంగా ఉత్తర్వులు ఇవ్వడాన్ని నిరసిస్తూ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని ఖిల్లా రోడ్‌లోగల విద్యుత్ భవన్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాంపల్లి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారాం నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వులు, జీవోలు లేకుండా విద్యుత్ సంస్థలు ఏకపక్షంగా ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ఇటీవల కల్పించిన అడ్‌హక్ ప్రమోషన్లను రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తమ అసోసియేషన్ ఎవరికీ వ్యతిరేకం కాదని, తమ హక్కుల కోసం పోరాడుతున్నామని తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజినీర్ ఉత్తం జాడే, అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈలు బాబా శ్రీనివాస్, గోపి, సాయిలు, అసోసియేషన్ నాయకులు శంకర్, నాగరాజు, జీవన్, శ్రీనివాస్, పోశెట్టి, ప్రజ్ఞ, లత, రాధ, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): చెరువుల వద్ద వినాయక నిమజ్జన ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీవో రాములు నాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఎస్సై యాదగిరి గౌడ్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో, ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామాల్లో ఆదివారం నిమజ్జన శోభాయాత్రను నిర్వహించాలని తెలిపారు. చెరువుల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. మండపాల నిర్వాహకులు చెరువుల లోపలికి వెళ్లకుండా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ఎంపీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రాములు నాయక్

కనీస వేతనాలు అమలు చేయాలి

నిజామాబాద్ సిటీ: కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోచమ్మగల్లీలో ప్రాంతీయ సదస్సు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.భూమన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులకు మరణ శాసనం విధించారని మండిపడ్డారు. హమాలీ, ఆటో మొబైల్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని గుర్తింపు కార్డు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. నాయకులు సీహెచ్ భూమేశ్వర్, దాసు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేత శ్రీనివాస్

పౌష్టికాహారంతోనే తల్లీ బిడ్డలకు ఆరోగ్యం



డిచ్‌పల్లి: సరైన పౌష్టికాహారంతోనే తల్లీ బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీవో స్వర్ణలత, మండల ఆరోగ్య విస్తర్ణాధికారి వై.శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ధర్మారం(బి), మెంట్రాజ్‌పల్లి, రాంపూర్ గ్రామాల్లో పోషణ మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు బుజ్జి, మమత, భాగ్యలక్ష్మీ, దేవపాల, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, సునీత, కావేరి, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



సిరికొండ: కుర్దుల్‌పేట్‌లో మాజీ ఎంపీటీసీ గాండ్ల సతీష్ సొంతంగా రూ.1.20 లక్షలతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో చీకటిగా ఉండటంతో లైట్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. లైట్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీని గ్రామస్తులు అభినందించారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్స్‌డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,800	వెండి (కిలో)	89,500
22 క్యారెట్స్	69,050		


– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	15	30
బీరకాయ	60	80	దోసకాయ	20	40
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	120	150	గోబిగడ్డ	20	40
కాకరకాయ	50	80	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	30	50
పాలకూర	90	140	కరివేపాకు	40	60
మెంతికూర	90	140	చామగడ్డ	40	60
కొత్తిమీర	150	200	గోరుచిక్కుడు	30	50
పుదీనా	70	90	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా పిషియన్)

స్క్రీన్-1	సరిపోదా శనివారం - 1.15,7.15 ఉత్సవం(తెలుగు)- 4.20 35 చిన్నకథ(తెలుగు)-10.30
స్క్రీన్-2	భలే ఉన్నాడే -10.30,7.25 మత్తు వదలరా(తెలుగు)-1.30 ఎ.ఆర్.ఎం.3డీ(తెలుగు)-4.20 10.20
స్క్రీన్-3	35 చిన్నకథ - 10.50,1.50,7.30 మత్తు వదలరా-2(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ప్రేమికుడు(తెలుగు)-10.00 మత్తు వదలరా-2-1.30,7.45, 10.45 స్త్రీ(హిందీ)-4.30
స్క్రీన్-2	ఎ.ఆర్ఎం.3డీ(తెలుగు)-12.15, 7.00 సరిపోదా శనివారం -3.25,10.10
స్క్రీన్-3	భలే ఉన్నాడే(తెలుగు)-10.25,7.30 చిన్నకథ కాదు(తెలుగు)-1.25,10.30 మత్తు వదలరా-2(తెలుగు)-4.30
స్క్రీన్ -4	ఉత్సవం(తెలుగు)-11.00,7.15 తుంబడ్(తెలుగు)-2.00 కళింగ(తెలుగు)-4.40
లలితామహల్	సరిపోదా శనివారం (తెలుగు)
దేవి	మత్తు వదలరా-2 (తెలుగు)
నటరాజ్	భలే ఉన్నాడే (తెలుగు)
విజయ్	ఎ.ఆర్.ఎం 3డీ (తెలుగు)